www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 జులై 2024
5
అన్నమయ్య

## వినికిడి పరికరాలు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినికిడి లోపంతో బాధపడుతున్న వృద్ధుడికి ఉచిత హియరింగ్ హెడ్స్‌ను అందజేసి దాతృత్వాన్ని వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి. కురబలకోట మండలం కనసానివారిపల్లె కు చెందిన పేద రైతు, బధిరుడు నారాయణరెడ్డి వినికిడిలోపంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఉదయ్ మోహన్‌రెడ్డి తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జ్ జయచంద్రారెడ్డి సూచన మేరకు.. శనివారం వృద్ధ బధిరుడికి ఉపయోగకరమైన హియరింగ్ హెడ్స్‌ను అందించారు. ఇప్పుడు తనకు స్పష్టంగా వినిపిస్తోందని నారాయణ రెడ్డి తెలిపాడు.

వృద్ధుడికి వినికిడి పరికరాలు అందిస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి

# గండికోట నిర్వాసితుల పరిహారం సంగతేమిటో?

- రూ.454 కోట్ల చెల్లింపులకు నిరీక్షణ
- అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దృష్టి సారించేనా?
- గండికోట నిర్వాసితుల ఎదురుచూపు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లిస్తాం. ఇదీ 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనల సందర్భంగా అన్న మాటలివి. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఆసరా చేసుకుని టిడిపి అభ్యర్థి భూపేష్‌రెడ్డి ఏకంగా పాదయాత్ర చేసిన సంగతి తెలిసిందే. టిడిపి ఆశించిన మేరకు కూటమి అభ్యర్థులుగా పార్లమెంట్ తరుపున భూపేష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలవడం, ఎంపీగా గెలుపు సమీపానికి రావడం ఆశ్చర్యపరిచింది. గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపుల విషయంలో నిర్వాసితుల్లో ఆసక్తి నెలకొంది.

గండికోట రిజర్వాయర్ రాయలసీమకే కలికితురాయి. ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన త్యాగధనులు నిర్వాసితులు. నిర్వాసితులను నిర్లక్ష్యం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. 2018 ఆగస్టులో టిడిపి సర్కారు గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షల చొప్పున పరిహారం చెల్లింపులు చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో జగన్ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే గండికోట నిర్వాసితులకు అదనంగా రూ.3.25 లక్షలను కలిపి రూ.10 లక్షల వరకు చెల్లింపులు చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన హామీ మేరకు గత ఐదేళ్లుగా సుమారు 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్లు చెల్లింపులు ఆచరణ దిశగా అడుగులు పడలేదు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల పరిధిలోని 22 గ్రామాలు ముంపు పరిధిలోనికి వచ్చిన సంగతి తెలిసిందే. వీటి పరిధిలో 17,809 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.1800 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. 16,800 పిడిఎఫ్‌లకు రూ.10 లక్షల చొప్పున రూ.1346 కోట్లు పరిహారం చెల్లించినట్లు సమాచారం. మిగిలిన 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్ల చెల్లింపులకు దశాబ్దాల తరబడి నిర్వాసితులు ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. ఇందులో ఫేజ్-1 కింద అప్పటి సిఎం హామీ కింద రూ.295 కోట్లు, మిస్సింగ్ పిడిఎఫ్‌లకు రూ.46 కోట్లు, ఫేజ్-2 కింద కొండాపురం గ్రామానికి రూ.53 కోట్లు, ఫేజ్-3 కింద రూ.999 పిడిఎఫ్‌లకు రూ.56 కోట్లు చొప్పున రూ.454 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా వైఎస్ జగన్ గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షలకు అదనంగా 3.25 లక్షల చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని అరకొర చెల్లింపులు చేసి మిగిలిన నిర్వాసితులను విస్మరించారు. గండికోట నిర్వాసితులకు రూ.110 కోట్లతో 18 కాలనీలకు రూపకల్పన చేశారు. రూ.100 కోట్లతో 11 నిర్వాసిత కాలనీలను పూర్తి చేశారు. రూ.35 కోట్లు బిల్లుల్ని అప్‌లోడ్ చేశారు. మరో రూ.25 కోట్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. మొత్తం 18 నిర్వాసిత కాలనీల్లో ఎనిమిది కాలనీలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందిన కూటమి ఎమ్మెల్యేలపై గండికోట నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనల సందర్భంగా, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా పాదయాత్ర సాగించిన సి.భూపేష్‌రెడ్డిపై గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపులపై ఇచ్చిన హామీలను అమలు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

గండికోట రిజర్వాయర్

# జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

## - రాజ పత్రాల దహనంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగులు, ఉపాధ్యాయులు వ్యతిరేకించిన గ్యారెంటీడ్ పెన్షన్ స్కీం గతేడాది అక్టోబర్ 20 నుండి అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం సరైనది కాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ అన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట గెజిట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు పెద్దఎత్తున పోరాటాలు చేశారని, ఉద్యోగుల పోరాటాలు అణచివేస్తూ గత ప్రభుత్వం గ్యారెంటీడ్ పెన్షన్‌ను వర్తింపచేస్తూ 54 జిఒ అమలు చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పెన్షన్ స్కీంను వర్తింపచేస్తామని కూటమి ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చి ఈ రోజు గెజిట్‌లో గ్యారెంటీడ్ పెన్షన్ నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని కోరారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఈ ప్రభుత్వం పాత తేదీలతో అమలు చేసేందుకు రాజపత్రం విడుదల చేసిందంటే వైసిపి ప్రభుత్వ వారత్వాన్ని పుణికి పుచ్చుకో వాలనుకుంటుందా అని ప్రశ్నించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. పిఇటి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57 ప్రకారం వెంటనే వారికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, చిన్నమండెం మండలం అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సహాధ్యక్షులు కిపాయితుల్లా, రెడ్డి ముని సుధాకర్, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, సహాధ్యక్షులు రెడ్డి బసయ్య, ట్రెజరర్ రఫీఖాన్, సుండుపల్లె మండలం నాయకులు శశికిరణ్, వీరవల్లి మండలం అధ్యక్షుడు నాగార్జున, గుర్రంకొండ మండల నాయకులు నర్సింహారెడ్డి, శశిభూషణ్, పెద్దమండెం మండలం నాయకులు చలపతి, రాజేంద్ర, గఫార్‌ఖాన్, రాజబాబు, హిమాయుద్దీన్, ఇనాముల, షబ్బీర్, వరప్రసాద్, టి.లక్ష్మీపతి పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ పత్రాలను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

# విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారందరూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల చేతి వృత్తులును ప్రోత్సాహించుటకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం 17వ తేదీన ప్రారంభిస్తారని తెలిపారు. 18 రకాల చేతి వృత్తుల వారికి కులంతో సంబంధం లేకుండా ఈ పథకంలో నమోదు చేసుకొన వచ్చన్నారు. ఈ నమోదు గ్రామ సచివాలయం, గ్రామ స్థాయిలో సిఎస్‌సి కేంద్రాలలో ఉచితంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. చర్మకారులు, రజకులు, దర్జీలు, జాలర్లు, బొమ్మల తయారీ దారులు, పూల దండలు అల్లే వారు, కత్తులు తయారు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, క్షరకులు, తాపీ, పడవల తయారీ, సంప్రదాయ బొమ్మల తయారీ దారు లు, బుట్ట, చాప, చీపుర్లు నేసేవారు, శిల్ప కళాకారులు నమోదు చేసుకోవ చ్చన్నారు. ఈ పథకానికి 18 ఏళ్లు కంటే ఎక్కవ వయస్సు కలిగి వారి పూర్వీకుల నుండి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్తకళాకారులు ఈ విశ్వ కర్మ కింద నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఎంపిక చేయు లబ్దిదారుడు కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం యొక్క క్రెడిట్ ఆధారిత పథకాల కింద రుణాలు పొంది ఉండ కూడదని తెలిపారు. రుణాన్ని తిరిగి చెల్లించిన వారు పిఎం విశ్వకర్మ కింద అర్హులన్నారు. కుటుంబంలో ఒకరు మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అర్హులు, లబ్దిదారుల గుర్తింపునకు కులంతో సంబంధం లేదన్నారు. ఈ విశ్వకర్మ ప్రోగ్రామ్ వలన కలిగే ప్రయోజనాలు ఐడికార్డు, సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఆసక్తి కల వారికి 5-7 రోజుల శిక్షణ కూడా ఇస్తామన్నారు.శిక్షణ సమయంలో రోజుకు రూ.500 ఇస్తామని, రూ.15 వేల విలువైన టూల్ కిట్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. మొదటి విడత రూ.లక్ష లోన్(18 నెలల రీ పేమెంట్) రెండవ విడత రూ.2 లక్షల లోన్(30 నెలల రీ పేమెంట్)పై రుణానికి సంవత్సరానికి 5 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం క్రింద మీ సచివాలయంలోని డిజటల్ అసిస్టెంట్ దగ్గర గాని కామన్‌సర్వీస్ సెంటర్ సందుగాని నమోదు చేసుకొవాలని తెలిపారు. ఈ సదవకాశాన్ని అన్నమయ్య జిల్లాలోని కులవృత్తుల వారు అందరూ సద్వినియోగ పరచుకోగలరుని తెలిపారు.

# ఎస్‌పిలు బదిలీ

## అన్నమయ్య ఎస్‌పిగా విద్యాసాగర్
## కడప ఎస్‌పిగా హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలు బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా ఎస్‌పిగా హర్షవర్ధన్‌రాజు, అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా విద్యాసాగర్ నాయుడులను నియమించింది. ప్రస్తుతం కడపలో పనిచేస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్‌ను జనరల్ డైరెక్టర్ ఆఫ్ పోలీస్‌కు రిపోర్టు చేయాలని ఉత్త ర్వుల్లో పేర్కొంది. ఈయన 2023 నవంబర్ నుంచి సుమారు 11 నెలలుగా ఎస్‌పిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలను సైతం ప్రశాంతంగా నిర్వహించడంలో సఫలీకృతులు కావడం తెలిసిందే. ఈయన స్థానంలో తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హర్షవర్ధన్‌రాజును నియమించింది. ఈయన గతంలో అన్నమయ్య జిల్లా ఎస్‌పిగానూ విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాయైన అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహించిన అనుభవం కలిగి ఉన్న నేపథ్యంలో జిల్లా బౌగోళిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండే అవకాశం ఉంది. అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావును ప్రభుత్వం బదిలీ చేసింది. ఈయన స్థానంలో కృష్ణా జిల్లా గ్రౌహౌండ్స్‌లో ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్‌నాయుడును నియమించింది. ఈయన కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగంలో ఉత్కంఠ నెలకొంది. సుమారు రెండేళ్ల కిందటి నుంచి అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావును అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేసింది.

విద్యా సాగర్ నాయుడు

హర్షవర్ధన్‌రాజు

# ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా పరి ష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం తన నివాసం దగ్గరికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు మేరకు వారి సమస్యను సంబంధిత అధికారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై అధి కారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండడంతో అక్కడ వెళ్లి సమస్యను పరిశీలించారు. వెంటనే వర్షపునీరు వెళ్లేందుకు తగిన కాలువ ఏర్పాటు చేయాలని అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం అన్నమయ్య సర్కిల్ వద్ద అనపగుట్టకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ప్రజలు ఆ సమస్యను ఎమ్మెల్యేకు విన్నవిం చారు. వెంటనే సంఘటన స్థలం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే అనపగుట్టకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిం చారు. అనంతరం సురభి కాలనీలో 2.5 లక్షలతో నిర్మిస్తున్న కాలువకు భూమి పూజ చేశారు. 75 మీటర్ల పొడవు గల ఈ కాలువ ఇక్కడి వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో వెంటనే నిర్మాణం చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, టిడిపి, జనసేన నాయకులు ఉన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నిల్వ ఉన్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

## ఇంద్రజాల ప్రదర్శనకు ఫ్యూచర్ మైండ్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటకు చెందిన ప్రముఖ ఇంద్రజాల ప్రదర్శకులు, జాదూరత్న అవార్డు గ్రహీత యు.పి రాయుడు ఆద్వర్యంలో ఆదివారం గుంటూరులో జరిగే అమరావతి ఫెస్టివల్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర స్థాయి ఇంద్రజాల ప్రదర్శనలకు రాజంపేట ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలకు చెంది 11 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని కరస్పాండెంట్ నంద కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగంలో తమ విద్యార్థులకు యు.పి రాయుడు దాదాపు 50 అంశాలను విద్యార్థులకు పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. పాఠశాల తరపున రాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ పై అవగాహనతో కూడిన మెలుకువలు నేర్పడం జరిగిందని, ఇంద్రజాల ప్రదర్శనలో రాబోవు రోజుల్లో మరింతమంది సిద్ధం కావాలనే లక్ష్యంతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి కళలను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, వారికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు యు.పి రాయుడు ధన్యవాదాలు తెలిపారు.

## సిఎం చంద్రబాబును కలిసిన 'రేవూరి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి జాతీయ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్ కలిశారు. ఈ సందర్భంగా వేణు గోపాల్ మాట్లాడుతూ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తుపెట్టుకుంటామని, వారికి తగిన గుర్తింపు ఇస్తామని సిఎం చెప్పారని అన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి కార్మికులు వినతిపత్రం సమర్పించారు. పీలేరు నియోజకవర్గంతో పాటు పరిసర గ్రామ పంచాయతీల కార్మికులు శనివారం నగిరిపల్లిలో ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెళ్ళబుచుకున్నారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఎన్నో ఏళ్లుగా తాము కాంట్రాక్టు కార్మికులుగానే పనిచేస్తున్నామని, తమకందే చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నామని, కనీసం తమ పిల్లల భవిష్యత్తుకు కూడా మంచి భరోసా ఇవ్వలేని పరిస్థితుల్లో తాము బతుకులీడుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఈ దుస్థితిని ముఖ్యమంత్రి ద ృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసుకున్నారు. ముందుగా వారు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు ధనాసి వెంకటరామయ్యతో పాటు చక్రవాండ్లపల్లి శ్రీనివాసులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్మికులు

## అమర్‌నాథ్‌రెడ్డి సేవలు ఆదర్శనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి దివంగత నల్లారి అమర్‌నాథ్‌రెడ్డి సేవలు నేటితరం ప్రజాప్రతినిధులకు ఆదర్శనీయమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే తన తండ్రి అమర్‌నాథ్‌రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా కలికిరి మార్కెట్ యార్డ్ సమీపంలోని ఆయన విగ్రహానికి, తన స్వగ్రామంలోని తండ్రి సమాధికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1962లో తన తండ్రి తొలిసారిగా స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా వాయల్పాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారున్నారు. 1972, 1978, 1985 ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి మొత్తం నాలుగు సార్లు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు మర్రిచెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి హయాంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా తన రాజకీయ ప్రస్థానాన్ని సాగిం చారని గుర్తు చేసుకున్నారు.

## సమాజ సేవే 'మానవత' లక్ష్యం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :** నిరంతర సమాజ సేవే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శిలు శ్రీనివాసులు నాయుడు, వై.నందకిషోర్‌గౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం సరస్వతి విద్యామందిరంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర నియంత్రణ డైరెక్టర్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు నాయుడు, బి.వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శిగా నంద కిషోర్‌గౌడ్, కోశాధికారిగా బి.రామచంద్రనాయుడు, సహాయ కార్యదర్శి వై.కృష్ణ మూర్తి, ఇసి సభ్యులుగా వెంకరేశ్వర్‌రెడ్డి, కె.నాగరాజ, సిసిఎన్.మూర్తి, కె.సుబ్బరామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహా దారులుగా మరో తొమ్మిది మందిని ఎన్నుకున్నారు. ఎన్నికైనవారిచే ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శిలు మాట్లాడుతూ మానవత సంస్థ ఎన్నో ఏళ్లుగా సమాజ సేవలో తమదైన ముద్ర వేసుకుందని, ముందుందు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మానవత సభ్యులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులు

## ట్రిపుల్‌ఐటికి 11 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లే అవుట్‌లో ఉన్న వివేకానంద మున్సిపల్ హై స్కూల్ నుండి 11 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారు. వీరందరూ ఇడు పులపాయ, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజిలల్లో చేరనున్నారు. ఎంపికైన వారిలో దీక్షిత, హేమమాలిని, ఖ్యాతి శ్రీ, లక్ష్మి, మహర్షిక, హరిత, తేజవర్ధన్, గణేశ్వరి, రాకేష్, రాగిణి, ధనలక్ష్మి లు ఉన్నారు. ఎంపికయిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రబాబు, వార్డు కౌన్సిలర్ శివయ్య, ఉపా ధ్యాయులు అభినందించారు.

## ఉత్తిదే!

ప్రజాదృష్టి

ఉచిత ఇసుక విధానం అమలు పేరుతో చేసిన హడావుడి బూమరాంగైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఆగమేఘాల మీద ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. కడప జిల్లాలో 13 రీచ్‌ల పరిధిలో 11 స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచి లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసింది. కానీ ఇక్కడే తేడా కొట్టింది. ఇసుక లబ్ధిదారునికి డిఎంఎఫ్, సీనరేజీ, నిల్వల రక్షణ మొదలగు నిర్వహణా ఖర్చుల పేరుతో వివిధ స్టాక్‌పాయింట్ల నుంచి రూ.381 నుంచి రూ.580 మేరకు పలు రకాలుగా వసూలు చేస్తోంది. దీనిపై ఇటీవల నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రతిపక్ష వైసిపి ఉచిత ఇసుక విధానం అమలుపై నిలదీసింది. టిడిపి ఉచిత ఇసుక విధానంపై ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని వాగ్బాణాలను సందించింది. ఉచిత ఇసుక విధానంపై ఇచ్చిన హామీ మేరకు డిఎంఎఫ్, సీనరేజీ, నిర్వహణా ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేసింది. ఉచిత ఇసుక విధానం అమలు పేరుతో సుమారు ఐదు రకాల పన్నుల్ని వసూలు చేయడం అంటే ఉచిత ఇసుక సరఫరా హామీని ఉల్లంఘించడమే అవుతుందని నిలదీసింది. దీనిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పం దిస్తూ ప్రస్తుతం ఉచిత ఇసుక నిల్వలను తరలించడానికి సంబం ధించిన తాత్కాలిక విధానమేనని, నదీ పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక లభ్యతను, రవాణాను సుప్రీంకోర్టు వ్యతిరేకించిన నేపథ్యంలో త్వరలో పూర్తిస్థాయి ఇసుక విధానానికి రూపకల్పన చేస్తున్నామని వివరించడం తెలిసిందే. ఉచిత ఇసుక విధానం అమలు నేపథ్యంలో లబ్ధిదారు భారీగా సమర్పించుకోవాల్సి ఆందోళన సహేతుకమేనని చెప్పవచ్చు. సుమారు ఐదు రకాల పన్నుల చెల్లింపుల అనంతరం రవాణా ఖర్చులను కలిపి లెక్కిస్తే టిప్పర్‌కు సుమారు రూ.8,500 వరకు మూల్యం చెల్లించాల్సి వస్తోందనే విశ్లేషణలు ఉన్నాయి. జిల్లా హద్దులను దాటి తరలించే అక్రమార్కులకు వరంగా మారుతోంది. దీని ప్రభావం స్థానిక లబ్ధిదారులపైనా పడే ప్రమాదం పొంచి ఉంది. ఇంతటి స్థాయిలో రుసుము చెల్లించుకోవాల్సిన నేపథ్యంలో ఉచిత ఇసుక విధానమనే పేరుపెట్టడం సహేతుకం కాదని విమర్శల వర్షం కురుస్తోంది. దీనిపై రాష్ట్రప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తో ంది. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 40 వేల మంది భవన నిర్మా ణ కార్మికుల భవితవ్యం ఇసుక, ఇటుక, సిమెంట్ లభ్యతపై ఆధార పడి ఉంది. ఇసుక ఆవశ్యకతను గమనించిన టిడిపి జాతీయ అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సార్వ త్రిక ఎన్నికల ప్రచారంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామనే హామీ పేరుతో ఊదరగొట్టిన నేపథ్యం చర్చనీయాంశంగా మా రింది. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అనే జోడు గుర్రాలను సవారీ చేయడం తనకు తెలుసునని, సంపదను సృష్టించడం ద్వారా సమ ర్థంగా అమలు చేస్తామనే వాగ్దానాలను అమలు చేయడం రాష్ట్ర నా యకత్వ దక్షత, సమర్థతలకు పరీక్షగా మారింది. రాష్ట్రంలో అప్పు లేనిదే పూటగడవని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అసాధ్యమని తెలిసీ హామీలిచ్చి, వాటి అమలు ప్రశ్నార్థకంగా మారి ంది.ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఏమి చేయాలో తెలియని వాతావరణం నెలకొంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

# బోగస్ సర్టిఫికెట్లు ఏరివేతకు అధికారులను ఆదేశించాలి

## జెసి రాష్ట్ర కన్వీనర్ విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ఈ 16 న జరిగే ఎపి కేబినెట్ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖలోని మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ బోగస్ సర్టిఫికెట్లు ఏరివేతకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆదేశించాలని, బోగస్ సర్టిఫికెట్ దారులు బరితెగించి తప్పుడు సమాచారంతో రాష్ట్ర ఉన్నతాధికారులను జైలుకు పంపే ప్రయత్నాన్ని నిలువరించాలని, 2002 డిఎస్‌సి కాంట్రాక్టు పారామెడికల్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్‌కు ముగింపు పలకడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఎపి డిఎస్‌సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోగస్ సర్టిఫికేట్లు సత్వరం ఏరివేయలని, అదే సమయంలో జెన్యూన్ సర్టిఫికేట్ దారులను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు అక్రమ ధనార్జన లక్ష్యంగా పనిచేస్తున్న అవినీతి అధికారుల బారినుండి నిజాయితీయైన అధికారులను కాపాడాలని కోరారు. బోగస్ సర్టిఫికేట్ దారులకు డిఎస్‌సిలో అక్రమ మార్కులు మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందుతున్న ప్రక్రియ పట్ల ఉన్నతిధికారుల ఉదాసీనంగా వ్యవహ రించడం వల్లనే ఈనాటి ఈ పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. ఇదే 2002 రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ద్వారా వివిధ క్యాడర్లలను భర్తీ చేసినప్పటికీ వాటిన్నిటికి ఒకే సారి ముగింపు పలికారని, నేటికీ 22 సంవత్సరాల కాలం గడిచిన,ఆదే నోటిఫికేషన్ ను హెల్త్ అసిస్టెంట్ క్యాడర్ ను మాత్రం బోగస్ సర్టిఫికేట్ల మాఫియా సూచనలతో ప్రతి దశలో న్యాయస్థానాలకు తప్పుడు సమాచారంతో తప్పుదారి పట్టించి బారి యెత్తున వ్యాపారం కోనసాగతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నిజాలను నిర్భయంగా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి కోర్టుకు పిటనర్ల రూపంలో ఉన్న బొగస్ సర్టిఫికేట్ ఏరివేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న అర్హులైన ప్రభుత్వ శిక్షణ సంస్థల హెల్త్ అసిస్టెంట్లు త్వరితగతిన రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రయివేట్ శిక్షణ సంస్థల సర్టిఫికేట్లు బోగస్‌ని తేల్చి చెప్పిన విజిలెన్స్ రిపోర్ట్ పరిగణలోనికి తీసుకోని చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ముక్కా వరలక్ష్మి

## బాధితుడికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని మంగంపేట ఆర్ఆర్ సెంటర్-1లో నివాసమున్న కళ్యాణదుర్గం వెంకటేష్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయంతెలుసుకున్న రైల్వే కోడూరు టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ముక్కా కుటుంబానికి రుణపడి ఉంటామని,ఆర్థిక చేసి అండగా నిలిచారని అన్నారు. ముక్కా ఫౌండేషన్ పట్ల నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తల్లెం రమణారెడ్డి, లావులూరు చరణ్, రాజగోపాల్, మారాల మల్లికార్జున పాల్గొన్నారు.

## నేడు అన్నదానం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన ముద్రవేసిన ములకలచెరువు మాజీ సిఐ రిషికేశవ 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం ఆదివారం పిటిఎం బస్టాండ్ లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగారి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సిఐ రిషికేశవ ఎంతో నిబద్ధతతో పనిచేశారని అన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ఆయన నిరంతరం కష్టపడి పనిచేసే వారన్నారు. ఆయన సిఐగా పని చేసినన్ని రోజులు ములకలచెరువు సర్కిల్ పరిధిలో నేరాలు గణనీయంగా తగ్గాయని అన్నారు. అటువంటి పోలీస్ అధికారులు చాలా అరుదుగాఉంటారని అన్నారు. ఆయన జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మంత్రి నారా లోకేష్‌తో టిడిపి నాయకులు శ్రీనివాసులు

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

మంత్రి నారా లోకేష్‌ను శనివారం శీలంవారి పల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పూజారి శ్రీనివాసులు మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను మంత్రికి వివరించినట్లు చెప్పారు. సరైన నాయకత్వం లేక ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. లోకేష్ స్పందించి మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గం పరిస్థితులు చక్కదిద్దుతామని అన్నారు. పార్టీ గెలుపు, అభ్యున్నతి కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారన్నారు. త్వరలో నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిని నియమిస్తామని నాయకులు,కార్యకర్తల ఇబ్బందులు తొలగిపోతాయని ఆయన అన్నారు.

## కువైట్‌లో తంబళ్లపల్లి వాసి మృతి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

తంబళ్లపల్లి మండల కేంద్రానికి సమీపంలో కే.మేకలవారి పల్లెకు చెందిన ఎస్.శ్యామ్ కుమార్ రెడ్డి(46) బతుకుతెరువు కోసం కువైట్‌కు వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..తంబళ్లపల్లి మండలం కొండ కింద మేకల వారి పల్లెకు చెందిన శ్యామ కుమార్‌రెడ్డి, మధుప్రియ దంపతులు 2019లో బతుకుతెరువు కోసం కువైట్‌కు వెళ్లారని తెలిపారు. అక్కడ శ్యాంకుమార్ రెడ్డి పెట్రోల్ బంక వర్కర్ గా పనిచేస్తుండగా భార్య గృహిణిగా ఉంటుందని చెప్పారు. ఈ నెల 10న శ్యామ్ కుమార్ రెడ్డికి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడన్నారు. మృతుని భార్య కుటుంబ సభ్యులు అక్కడే ఉండడంతో ఈ విషయాన్ని కే.మేకల వారి పల్లెలో ఉన్న బంధువులకు ఫోన్ ద్వారా చేరవేశారు. కువైట్ నుంచి శ్యామ్ కుమార్ రెడ్డి మృతదేహం శుక్రవారం సాయంత్రం స్వగ్రామమైన మేకల వారి పల్లెకు చేరుకోగా శనివారం ఉదయం అంత్యక్రియలు పూర్తి చేశారు.

రూపానందరెడ్డిని సన్మానిస్తున్న నాగభూషణం

## 'ముక్కా'ను సన్మానించిన టూరిజం అధికారి

**ప్రజాశక్తి-పుల్లంపేట**

రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిని జిల్లా టూరిజం అధికారి ఎం.నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ జిల్లా పర్యాటక, ఆధ్యాత్మిక విషయాలపై చర్చించినట్లు తెలిపారు. బాలిరెడ్డిపల్లె మాజీ ఎంపిటిసి మురుమల్ల గురు ప్రసాద్, తుమ్మలగొందు సుబ్బరాజు మండలంలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పర్యాటక శాఖను అభివృద్ధి చేయాలని, మరింత మెరుగుపరచాలని రూపానందరెడ్డిని కోరారు. రైల్వే కోడూరును కూడా పర్యాటక అభివృద్ధి కేంద్రంగా మలచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకేపాటి సుకుమార్ రెడ్డి, సాలవ రమణరాజు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు రాజ్యాధికారమే ధ్యేయం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

భవిష్యత్తులో విభిన్నప్రతిభావంతులకు రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తామని విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నెం చిన్న సుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఆధ్వర్యంలో చిన్న సుబ్బయ్యకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈనెల 17న ప్రొద్దుటూరులోని మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్న సందర్భంగా విహెచ్‌పిఎస్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాజంపేట ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ తమ కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ పింఛన్ పెంపునకు తమ వంతు సహాయ సహకారాలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట అధ్యక్షులు మల్లు సుబ్బ నరసారెడ్డి, కోశాధికారి ప్రభాకర్, వెంకట ప్రసాద్, శ్రీను, రెహమాన్, షమీ, నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

చిన్న సుబ్బయ్యను సన్మానిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

# బరువెక్కిన పాఠశాల బ్యాగ్

- ◆ శక్తికి మించి బరువు మోస్తున్న విద్యార్థులు
- ◆ పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై ప్రభావం
- ◆ ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒత్తిడితో కూడిన విద్యా బోధనతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు బండెడు పుస్తకాలతో కుస్తీ పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారు. కేజీల కేజీల బరువైన పుస్తకాలను మోస్తూ పాఠశాల విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చదువుకునేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఐబి పుస్తకాలను మోయడం వల్ల వేలాదిమంది పిల్లల ఎదుగుదల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్యులు గగ్గోలు పెడుతున్నారు. ప్రయివేట్ పాఠశాలలో పుస్తకాల భారం ఎక్కువగా ఉంటుంది. సర్కారు బడులను మినహాయిస్తే ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల స్కూలు బ్యాగుల అధిక బరువు ఉంటుంది. టెక్నాలజీ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా విద్యా విధానంలో మార్పులు కానరావడం లేదు. పుస్తకాల భారంతో పుస్తకాల బరువుతో విద్యార్థులు సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్ని ఎక్కువ పుస్తకాలు ఉంటే అంత బాగా చదువుతారని పరిస్థితిలోకి కొన్ని ఆయా విద్యాసంస్థల ప్రచారం నిర్వహిస్తున్నాయి. తమ వ్యాపార స్వలాభం కోసం అవసరానికి మించి పలు ప్రయివేట్ విద్యాసంస్థలు భారీగా పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాయి. వాటి ధరలను విపరీతంగా పెంచి విక్రయాలు జరుగుతున్నాయి. సాధారణంగా ఎనిమిది నుంచి పదవ తరగతి చదివే ఆరోగ్యకరమైన చిన్నారి బరువు 25 నుండి 35 కేజీలు ఉంటుంది. ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 10 నుంచి 15 కేజీల బరువు ఉన్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ వెళుతున్నారు. నిబంధనల ప్రకారం ఒకటవ తరగతి విద్యార్థి 750 గ్రాములు, రెండవ తరగతి 2 కేజీలు, 3,4 తరగతుల పిల్లలు మూడు కేజీలు, 5వ తరగతి నాలుగు కేజీలు లు, 6వ తరగతి ఆరు కేజీలు, 7వతరగతి ఎనిమిది కేజీలు, 8వ తరగతి పది కేజీలు, 9,10 వ తరగతి విద్యార్థులు 12 కేజీలు మాత్రమే బరువు మోయాల్సి ఉంది. ఈ నిబంధనలకు భిన్నంగా రెట్టింపు బరువు మోస్తున్నారు. ఆయా స్కూల్ బ్యాగులను మోస్తున్న విద్యార్థులు చిన్న వయసులోనే నడుము మోకాళ్ళ నొప్పులు ఇతరత్రా ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్నట్లు తల్లిదండ్రులు వెల్లడిస్తున్నారు. స్కూలు బ్యాగుల బరువును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ వీటిని అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. బరువులు పిల్లల ఎదుగుదల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని యూనిసెఫ్‌తో పాటు వివిధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో కంటే ప్రయివేట్ స్కూళ్లలోనే పుస్తకాల బరువు అధికంగా ఉంటుంది. క్లాస్ ఫెయిర్ వర్క్ కోసం ప్రత్యేకంగా వేర్వేరు నోటుపుస్తకాలు ప్రతిరోజూ తెప్పిస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేని పుస్తకాలను భద్ర పరుచుకునేందుకు తరగతి గదుల్లో అల్మారాలు రేకులను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలల్లోనూ ఈ ఏర్పాట్లు లేవు. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటంతో మోత బరువుతో మెట్లు ఎక్కుతున్న విద్యార్థులు వెన్ను మోకాళ్ళ నొప్పులతో సతమతమవుతున్నారు. శక్తికి మించి బరువు మోయటంతో వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతుంది.పిల్లల ఆరోగ్యంపై దృష్టిపై వారిపై అధికభారం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పురుషుల జట్టు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

జిల్లా కేంద్రం రాయచోటిలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ ఎంపికల పోటీలలో ఆదర్శ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల పీడీ నేలకంఠేశ్వరరావు, ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సీనియర్ మహిళల సాఫ్ట్ బాల్ విభాగంలో ఇంటర్(ఎంపిసి)ఫస్ట్ ఇయర్ విద్యార్థి మధు, తొమ్మిదవ తరగతి విద్యార్థిని జాస్మిన్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ విభాగంలో ఇంటర్(ఎంపిసి) ద్వితీయ సంవత్సరం విద్యార్థి రోహిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో చిత్తూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో వీరు ముగ్గురు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉద్యోగ అవకాశాలలో మెరుగుగా ఉంటాయని అన్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయబృందం, విద్యార్థులు అభినందించారు.

# ఏడాది తర్వాత భూమిలో మిగిలిన కాయలకు మళ్లీ మొలకలు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

గత ఏడాది సాగు చేసిన వేరుశనగ పంటకు భూమిలో మిగిలిపోయిన కాయలకు మళ్లీ మొలకలొచ్చి పంటగా ఏర్పడింది. వివరాల్లోకెళితే తంబళ్లపల్లె సాలవీధికి చెందిన రైతు ఆనంద్ 2023 మార్చి నెలలో ఒకటిన్నర ఎకరా వేరుశనగ పంట సాగు చేశాడు. ఆగస్టు నెలలో వేరుశనగ చెట్లు మార్పిడి చేయగా 15 బస్తాలు దాకా దిగుబడి వచ్చింది. ఆ పంటలో ఎక్కువగా వేరుశెనగ కాయలు భూమిలోనే ఉండిపోయాయి.దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కురిసిన వర్షాలకి అప్పుడు భూమిలో మిగిలిపోయిన కాయలకు మొలకలు వచ్చి పొలం మొత్తం వేరుశెనగ చెట్లు వచ్చాయి. గమనించిన రైతు సగం చేను దున్నుతుండగా వచ్చిన చెట్లను అలాగే ఉంచాడు. కొన్ని రోజుల క్రితం పది మంది కూలీలతో పంట కలుపు మొక్కలను తవ్వి గడ్డి మందు కొట్టాడు. దీంతో ప్రస్తుతం పంట చూడటానికి నిజంగానే విత్తనాలు వేసి సాగు చేసిన పంట లాగే కనిపిస్తోంది. మరో నెల రోజుల్లో చెట్లను పీకాలని సుమారు 5 నుండి 7 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందంటున్నాడు ఆ రైతు.

సాగు చేసిన పంటలా కనిపిస్తున్న వేరుశనగ

# డయేరియా, డెంగీపై అవగాహన

డయేరియా, డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**ప్రజాశక్తి-కలికిరి**

కలికిరి మండలం లోని గుట్ట పాలెం పంచాయితీ యల్లంపల్లి గ్రామంలో కలికిరి ఎంపిడిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప అధ్యక్షతన వైద్యశిబిరం ఏర్పాటు చేసి డెంగీ, డయేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ముజీబ్, పారిశుధ్య కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి గోపి, ఇఒఆర్‌డి పరుశురాం సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసి తాగాలో చేసి చూపించారు. డెంగీ జ్వరాలు ప్రబలకుండా ఫ్రైడే డ్రై డే పాటించాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని, ప్రతి రోజూ సాయంత్రం ఇంటిలో పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కృష్ణ కుమారి, ఎఎన్ఎం. రమాదేవి, అంగన్వాడీ కార్యకర్త కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు తెలిపారు. శనివారం బోధనాస్పత్రిలో కుష్టువ్యాధి పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ కుష్టు వ్యాధి లక్షణాలను వివరించారు. చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కనుబొమ్మల కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం లక్షణాలు ఉంటే కుష్టువ్యాధికి గురవుతున్నట్లు గుర్తించాలన్నారు. నొప్పిగా ఉన్న నరములు, చేతులు, పాదాలు, నరాలయందు తిమ్మిర్లు కలిగి ఉండడం, అరిచేతులు, కాళ్ళు పాదాలు స్పర్శలేకపోవడం, పొడిబారి పోవడం, చేతులు, పాదాలయందు నొప్పి తెలియని గాయాలు లేదా పుండ్లు కూడా వ్యాధి సంభవించే ముందు కలిగే లక్షణాలని తెలిపారు. చేతివేళ్ళు, కాలివేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, చల్లని లేదా వేడి వస్తువులు గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోయి మణికట్టు లేక మడమను పైకి లేపలేకపోవటం వంటి లక్షణాలు కూడా ఉండవచ్చని తెలిపారు. అంగ వైకల్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎండిటి చికిత్స తో కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కుష్టువ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ నెల 18 నుంచి వైద్య సిబ్బంది గడప, గడపకు వెళ్లి కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. వ్యాధి లక్షణాలపై, చికిత్సల గురించి ప్రజల్లో చైతన్యం కల్గించాలన్నారు. కార్యక్రమంలో డిపిఎంఒ వేణుగోపాల్, ఆర్ఎంఒ డాక్టర్ ప్రసాద్‌రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మంజు, నాగశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

## ఫౌండేషన్ సహకారం మరువలేనిది

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్** : మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సహకారం మరువలేనిదని రక్త గ్రహీతలు తెలిపారు. శనివారం స్థానిక క్యాంబెల్ హాస్పిటల్‌లో మే ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళకు రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ క్యాంబెల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కె.గురుదేవి అనే మహిళకు రక్తం తక్కువగా ఉండడంతో ఓ-నెగటివ్ రక్తం అత్యవసరం కాగా.. బాధితులు తమ ఫౌండేషన్‌ను ఆశ్రయించారన్నారు. వెంటనే తమ ఫౌండేషన్ సభ్యుడు అంజన్ కుమార్‌చే రక్తదానం చేయించామన్నారు. రక్త దాత కె.అంజన్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎవరైనా దాతలు ఉంటే 82972 53484, 91822 44150, 79972 65096నెంబర్లను సంప్రదించాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, సాయికిరణ్, వెంకటేష్, సందీప్, పాములేటీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ కొండయ్య

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - డిఎంహెచ్‌ఒ కొండయ్య

**ప్రజాశక్తి-చిట్వేలి**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ కొండయ్య పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిఎంహెచ్‌ఒ కొండయ్య పరిశీలించారు. ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో విరేచనాలు అధికంగా కావడం లాంటివి జరిగినప్పుడు ముందస్తుగా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా వర్షాభావ కారణాలవల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిలువలు గుర్తించడం తద్వారా దోమలు అధిక సంఖ్యలో ఉత్పత్తి అవడం ద్వారా అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొనేలా వారికి తెలియజెప్పాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు కనిపించిన వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారుడు అబ్దుల్ వకీల్ అన్సారి , విజయ కుమారి, ఇస్మాయిల్ బాషా, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ: మొహరం సందర్భంగా కొలువుదీరిన పీర్లు

## కొలువుదీరిన పీర్లు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

హిందూ-ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన మొహరం పండుగ (పీర్లు) పండుగను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పీర్ల చావిడిలో వారం రోజులుగా పీర్లు కొలువుదీరాయి. నిర్వాహకులు పీర్ల మాబు రోజు ప్రార్థనలో నిర్వహిస్తూ భక్తులకు చక్కెర చదివింపులు చేస్తున్నారు. సోమవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశంతో మంగళవారం తెల్లవారి జామున పెద్ద పీరు మెరువని జరుగుతుందని నిర్వాహకులుతెలిపారు. **కలకడ:** హిందూ-ముస్లిం ఐక్యతకు మారుపేరుగా మొహరం పండుగను నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతున్నది. మండలంలోని కలకడ, ఎర్రకోటపల్లి, కోన, నడిపించర్ల ,పాపిరెడ్డి గారిపల్లి, అగ్రహారం, దేవళంపేట తదితర గ్రామాలలో పీర్లను ముస్లిం సోదరులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నుంచి ప్రతిరోజు ప్రత్యేక పూజలు అందుకుని బుధవారం జల్ది నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

అల్ల నేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. మనకు ప్రకృతి అనేక పండ్లను కాలానుగుణంగా అందిస్తూ ఉంటుంది. వాటిలో అల్ల నేరేడు పండ్లు ఒక రకం. మే నెలలో ప్రారంభమై జూన్, జూలై వరకు లభిస్తాయి. వీటిని తినడం వల్ల వాతావరణ మార్పుల కారణంగా వచ్చే ఇన్ఫెక్షన్‌ల బారిన పడకుండా మన ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చు. ఇవి చూడడానికి చిన్న ఉసిరి కాయల మాదిరి ఉంటాయి. ఈ చెట్లు ఎక్కువగా అటవీ ప్రాంతాల్లో పెరుగు తాయి. అటవీ ప్రాంతాల్లో నివసించే వారు వీటిని అడవుల నుండి సేకరించి పట్టణాలకు తెచ్చి అమ్ముతూ ఉంటారు. ఎక్కువగా అడవులల్లో తిరిగే వారు ఈ కాయలను నోట్లో వేసుకుని చప్పరిస్తూ నీటిని మింగుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల దాహం వేయకుండా ఉండడంతోపాటు శక్తిని కోల్పోరు. ఈ కాయలను చప్పరిస్తూ నడవడం వల్ల ఎంత దూరం నడిచినప్పటికీ కాళ్ల నొప్పులు రావు. అల్ల నేరేడు చెట్టు దగ్గర చక్కటి సువాసన ఉంటుంది. ఈ చెట్టు గాలిని పీలిస్తే మనసుకు ఎంతో హాయినిస్తుంది. ఈ చెట్టు గాలి పీల్చడం వల్ల మనం అనేక అనారోగ్య సమస్యలను కూడా దూరం చేసుకోవచ్చు. అల్లనేరేడు కాయలు వగరుగా ఉంటాయి. వీటిలో మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. ఈ పండ్లు తినడం వల్ల మనం చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చు. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ కాయలను మజ్జిగలో ఊర వేసుకుని మరి కొంతమంది తింటూ ఉంటారు. నిమ్మకాయ పచ్చడిలో వేసుకుని తింటూ ఉంటారు. ఇలా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఇన్ఫెక్షన్‌ల బారిన పడకుండా ఉండవచ్చు. అల్ల నేరేడు పండ్లను తీసుకోవడం వల్ల శరీరంలో విష పదార్థాలు, వ్యర్థాలు తొలగిపోతాయి. రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. అల్లనేరేడు తినడం వల్ల నాడీ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. మెదడు చురుకుగా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మూత్ర పిండాల సమస్యలు తగ్గుతాయి. లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. లైంగిక సమస్యలతో బాధపడే వారు ఈ అల్ల నేరేడు పండ్లు తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిని పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరైనా తినవచ్చు. ఇలా అల్లనేరేడు పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఇవి లభించే కాలంలో వీటిని వీలైనంత ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

నగరంలోని ద్వారకానగర్‌లో ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి నివాసంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజా సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

# క్రైం కార్నర్

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-ములకలచెరువు**

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలం బురకాయలకోట రైల్వే స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కదిరి రైల్వే ఎస్ఐ ఇబ్రహీం తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుడి ఛాతిపై కాలిన గాయం, ఒళ్లంతా అస్పత్రిలో కట్లు కట్టినట్లు ఉన్న చామనచాయ రంగు వ్యక్తి బ్లూ లుంగీ, కాళ్లకు నల్లటి బెల్ట్ చెప్పులు ధరించి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే కదిరి ఎస్ఐ రహీంకు తెలపాలన్నారు.